విశ్వ'కథ'ంబమ్

# శానటోరియం


ఆంగ్లమూలం:
విలియం సోమర్‌సెట్ మామ్
అనువాదం:
కాకాని చక్రపాణి


**శానటోరియంలో చేరిన మొదటి ఆరు వారాలూ ఆషెన్‌డెన్ బెడ్ మీదే ఉండిపోయాడు. ఉదయం, సాయంత్రం అతన్ని చూడటానికి వచ్చే డాక్టరూ, నర్సులూ, భోజనం తెచ్చే ఆయా తప్ప అతను మరెవర్నీ చూడలేదు. లండన్‌లో అతన్ని పరీక్ష చేసిన డాక్టరు, క్షయవ్యాధని నిర్ధారించి, అతన్ని ఉత్తర స్కాట్ లెండ్‌లోని ఒక శానటోరియానికి పంపాడు.**

తను ఓపిగ్గా ఎదురుచూస్తున్న రోజు చివరికి వచ్చింది. ఇంక అతను లేచి తిరగవచ్చని డాక్టరు చెప్పారు. ఆ మధ్యాహ్నం నర్స్ అతను బట్టలు వేసుకోవడంలో సాయం చేసింది. వరండాలోకి తీసుకెళ్లింది, వీపు వెనుక కుషన్లు అమర్చింది. రగ్గుతో ఒళ్లంతా కప్పి, నిర్మలాకాశం నుంచి కురుస్తున్న ఎండ చూస్తూ ఎంజాయ్ చెయ్యమని చెప్పి వెళ్లిపోయింది.

శానటోరియాన్ని కొండ పైన కట్టారు. అక్కడి నుంచి చూస్తుంటే మంచులో కప్పిన గ్రామీణప్రాంతం కనిపిస్తూ ఉంటుంది. వరండాలో డెక్ ఛైర్లలో చాలామంది జనం కూర్చుని ఉన్నారు. కొంత మంది పక్కవాళ్లతో మాట్లాడుతుంటే, మరి కొంత మంది చదువుకుంటున్నారు. అప్పుడప్పుడూ ఎవరో ఒక రోగి ఖళ్లుఖళ్లుమని దగ్గి, ఆ తెర తగ్గాక భయపడిపోతూ జేబు గుడ్డ వంక చూసుకోవడమూ కనిపిస్తుంది. ఆషెన్‌డెన్‌ను వదలి వెళ్లిపోయే ముందు నర్స్ అతని పక్క కుర్చీలో ఉన్న వ్యక్తికి పరిచయం చేసింది, "వీరు ఆషెన్‌డెన్" అంటూ. "ఈయన మెక్లాడ్, వీరూ కాంబెల్. ఇక్కడున్న వాళ్లందర్లోకీ ముందు వచ్చినవాళ్లు. ఎంతో కాలంగా ఇక్కడ ఉంటున్నారు" అని ఆషెన్‌డెన్‌కు పరిచయం చేసి వెళ్లిపోయింది నర్సు.

ఆషెన్‌డెన్‌కు మరోపక్కన ఓ అందమైన అమ్మాయి కూర్చుని ఉంది. ఎర్రటిజుట్టు, నీలికళ్లు. ఆమె మేకప్ చేసుకోలేదు. పెదవులూ, బుగ్గలూ ఎర్రగా ఉన్నాయి మిగతా చర్మం అందుకు భిన్నంగా తెల్లగా ఉంది. ఆ తెల్లదనం జబ్బుకు చిహ్నమని తెలిసినా అది ఎంతో అందంగా ఉంది. ఫర్ కోటు వేసుకుని ఉంది ఆమె. శరీరం కనిపించకుండా రగ్ ఆమెని చుట్టబెట్టింది. ఆమె ముఖం పల్చగా ఉంది. అందుకే ఆమె ముక్కు కొసదేరి వున్నట్లనిపించింది. ఆమె ఆషెన్‌డెన్ వంక స్నేహపూర్వకంగా చూసింది కానీ మాట్లాడలేదు. కొత్తవాళ్ల మధ్య సిగ్గుపడే అతనూ మాట్లాడలేదు.


"ఇదే మొదటిసారా, మిమ్మల్ని లేచి తిరగవచ్చని చెప్పింది?" అడిగాడు మెక్లాడ్.

"అవును."

"మీ గదెక్కడ?"

చెప్పాడు ఆషెన్‌డన్.

"చిన్నదే. ఇక్కడున్న ప్రతి గదీ నాకు తెలుసు. పదిహేడేళ్ల నుంచి ఇక్కడుంటున్నాను. ఇక్కడున్న వాటిల్లోకెల్లా మంచి గదిని నాకిచ్చారు. కాంబెల్‌కి అది తనక్కావాలనివుంది. నన్ను ఖాళీచేయించాలని చూస్తున్నాడు. వాణ్ని అందులో అడుగుపెట్టనివ్వను. ఆ గది పట్ల నాకు హక్కుంది. తన కంటే నేను ఆర్నెల్లు ముందు వచ్చాను."



మెక్లాడ్ పొడగరి అనిపిస్తాడు. చర్మం ఎముకల మీద బిగుతుగా సాగినట్లు కనిపిస్తుంది. గుంటలు పడ్డ బుగ్గలు, కృశించిన ఆ ముఖంలో పెద్ద ముక్కు-కళ్లు అసాధారణంగా కన్పిస్తాయి.

"పదిహేడేళ్లంటే దీర్ఘకాలం"అన్నాడు ఆషెన్‌డెన్ మరేమనాలో తోచక.

"కాలం వేగంగా గడచిపోతోంది. నాకిక్కడ బాగుంది. ఒకటి రెండేళ్లున్న తర్వాత వేసవి కాలంలో బయటికెళ్లాను. అంతే ఆ తర్వాత వెళ్లలేదు. ఇప్పుడు ఇదే నా ఇల్లు. ఓ తమ్ముడూ, ఇద్దరు చెల్లెళ్లూ ఉన్నారు. వాళ్ల సంసారాలు వాళ్లవి. వాళ్లకు నా సంగతి పట్టదు. ఇన్నేళ్లు ఇక్కడుండి బయటికెళ్లాక, ఆ ప్రపంచం నచ్చదు మనకు. మన స్నేహితులు వాళ్ల పనిలో వాళ్లు నిమగ్నమై ఉంటారు. ఇప్పుడెళ్తే అంతా కొత్త. అంతా హడావుడి, సంరంభం, పనికిమాలినదాని కోసం. నిజానికి ఇక్కడే బావుంటుంది. ఇంక కాటికి తీసికెళ్లే వరకూ నేనిక్కడి నుంచి కదలను!"

కొంత కాలం తను జాగ్రత్తగా ఉంటే నయమై బయటికి పోవచ్చని చెప్పాడు ఆషెన్‌డెన్‌కు డాక్టరు. మెక్లాడ్ వంక విచిత్రంగా చూస్తూ, "పగలంతా మీరేం చేస్తుంటారు?" అనడిగాడు ఆషెన్‌డెన్.

"చెయ్యడమా? టీబీ జబ్బే హోల్ టైం జాబ్! టెంపరేచర్ చూసుకోవాలి, బరువు చూసుకోవాలి. బట్టలు వేసుకోవాలి. అన్ని పనులూ మెల్లగా చేస్తాను. బ్రేక్ ఫాస్ట్ తీసుకుని, పేపర్లు చదువుతాను. అలా నడచివస్తాను. ఆ తర్వాత విశ్రాంతి. లంచయ్యాక బ్రిడ్జ్ ఆడతాను. మళ్లీ విశ్రాంతి. రాత్రి భోజనం. కాసేపు మళ్లీ బ్రిడ్జ్. ఆ తర్వాత పడుకొంటాను. ఇక్కడో మంచి లైబ్రరీ ఉంది. కొత్త పుస్తకాలు తెప్పిస్తారు. నిజానికి నాకు పుస్తకాలు చదివే తీరిక లేదు. జనంతో మాట్లాడుతుంటాను. రకరకాల మనుషులు వస్తుంటారు, పోతూంటారు. కొంత మంది తమకు నయమైందనుకుని వెళ్లిపోతారు. కానీ వాళ్లలో చాలామంది తిరిగి వస్తుంటారు. కొంత మంది మరణించి వెళ్లిపోతుంటారు. నేను వెళ్లిపోయే ముందు ఇంకెంత మందిని చూడాలో!"

ఆషెన్‌డెన్‌కు మరో పక్క కూర్చున్న అమ్మాయి అకస్మాత్తుగా అంది. "పోయేవాళ్లని గురించి మెక్లాడ్‌లాగా హాస్యంగా మాట్లాడేవాళ్లెవరూ ఉండరు."

మెక్లాడ్ నవ్వాడు. "నాకు తెలీదులే ఆ సంగతి. ఎవరి విషయం వాళ్లు చెప్పటం మానవస్వభావం కాదు. నన్ను కాక మరో వ్యక్తిని వాళ్లు పట్టుకెళ్లడం నాకు సంతోషమే" అన్నాక ఆ పిల్లతో ఆషెన్‌డెన్‌కు పరిచయం లేదని గుర్తొచ్చి, "ఆ అమ్మాయి పేరు ఐవీ-ఐవీ బిషప్. ఇంగ్లీషు పిల్లే కాని చెడ్డపిల్ల మాత్రం కాదు" అన్నాడు ఆషెన్‌డెన్‌తో.

"మీరెన్నాళ్ల నుంచి ఉంటున్నారు ఇక్కడ?" అడిగాడు ఆషెన్‌డెన్ ఆమెను.

"రెండేళ్లే. ఇది నేనుండే చివరి శీతకాలం. ఇంక కొన్ని నెలల్లో నాకు బాగైపోతుంది. ఇంటికి వెళ్లిపోవచ్చని అన్నారు డాక్టర్ లెన్నాక్స్."

"పోదూ!" అన్నాడు మెక్లాడ్. "ఇక్కడే ఉండు, హాయిగా ఉంటావు."

అప్పుడో మనిషి ఓ కర్ర అసరాగా వరండాలో మెల్లగా నడుస్తూ వచ్చాడు.

"ఆయన మేజర్ టెంపుల్‌టన్" అంది ఐవీ, చిరునవ్వు నీలికళ్లలో వెలుగులీనుతూంటే. అతను దగ్గరకి రాగానే, "మిమ్మల్ని మళ్లీ చూసి నాకు ఆనందంగా ఉంది" అంది.

ఆ ప్రపంచం నచ్చదు మనకు. మన స్నేహితులు వాళ్ల పనిలో వాళ్లు నిమగ్నమై ఉంటారు. ఇప్పుడెళ్తే అంతా కొత్త. అంతా హడావుడి, సంరంభం, పనికిమాలినదాని కోసం. నిజానికి ఇక్కడే బావుంటుంది. ఇంక కాటికి తీసికెళ్లే వరకూ నేనిక్కడి నుంచి కదలను!"

"మరేం లేదు. కొద్దిగా జలుబు చేసింది. ఇప్పుడు బాగానే ఉన్నా." ఆ మాటలన్నాడో లేదో అతను ఖళ్లుఖళ్లుమని దగ్గసాగాడు, బలంగా కర్రనానుకుని. ఆ తెర తగ్గిపోగానే, హాయిగా నవ్వుతూ, "ఈ వెధవ దగ్గు తగ్గి చావటం లేదు. పొగ తాగటం ఎక్కువైంది. మానెయ్యమంటాడు డాక్టర్ లెన్నాక్స్. లాభంలేదు. అది నా వల్ల కాదు!"

అతను పొడుగాటి మనిషి. అందంగానే ఉంటాడు. పాలిపోయిన ముఖం, నల్లటికళ్లు, చక్కగా కత్తిరించుకున్న నల్లటి మీసాలు. ఆస్ట్రఖన్ కాలరున్న కోటు వేసుకున్నాడు. చురుగ్గా, కొంత ప్రదర్శనాత్మకంగా ఉన్నాడు. ఐవీ ఆషెన్‌డెన్‌ను పరిచయం చేసింది. అతను మర్యాదకు రెండు మంచి మాటలు చెప్పాడు. తన్ను శానటోరియం వెనకున్న చెట్లలో నడవమని డాక్టరు చెప్పాడని చెప్పి, ఐవీని తనతో రమ్మన్నాడు. వాళ్లు నడచిపోతూంటే మెక్లాడ్ వాళ్లను చూడసాగాడు.

"వాళ్ల మధ్య ఏదో ఉంది. జబ్బు పడకముందు, తగిలిన అమ్మాయిని వదిలేవాడు కాదంటారు అతన్ని గురించి" అన్నాడతను.

"ఇప్పుడలాంటి పరిస్థితిలో అతనున్నట్టు లేదే!" అన్నాడు ఆషెన్‌డెన్.

"ఎవరు చెప్పగలరు? ఇక్కడ నేనెన్ని భాగోతాలు చూడలేదూ? కథలుకథలుగా చెప్పగలను మీక్కావాలంటే."

"చెప్పండి, అవేమిటో విందాం."

మెక్లాడ్ నవ్వాడు. "ఒక్కటి చెప్తాను. మూడు-నాలుగేళ్ల క్రితం ఇక్కడొకావిడ ఉండేది. మహారంధి ఉన్న మనిషి. ఆమె మొగుడు ప్రతి పక్షానికీ ఆమెను చూడటానికి వచ్చేవాడు. ఆమె అంటే పిచ్చి అతనికి, లండను నుంచల్లా విమానంలో వచ్చేవాడు. ఆమె ఇక్కడెవడితోనో వ్యవహారం నడుపుతూందని డాక్టర్ లెన్నాక్స్‌కు అనుమానమొచ్చింది. కానీ ఆ వ్యక్తి ఎవరో తెలీలేదు. ఓ రోజు రాత్రి అందరూ పడుకున్నాక ఆమె



గది గుమ్మం ముందు పల్చగా రంగు పూయించాడు. మర్నాడు అందరి స్లిప్పర్లూ పరీక్ష చేశాడు. దొరికాడు దొంగ! వాణ్ని పంపించేశారు బయటికి. ఈ విషయంలో అతను కచ్చితమైన మనిషి. శానటోరియానికి చెడ్డ పేరు రావటం అతని కిష్టం లేదు."

"ఎన్నాళ్ల నుంచి టెంపుల్‌టన్ ఇక్కడ ఉంటున్నాడు?"

"మూడు-నాలుగు నెల్లు పక్క వదల్లేదు. అతనికేం పర్లేదు. ఆ ఐవీ పిల్ల వాడంటే పడిఛస్తుంటే మాత్రం అంత కంటే మరో మూర్ఖపు అమ్మాయి ఉండదు! ఆమెకు నయమయ్యే అవకాశం ఉంది. నేను చాలామందిని చూశాను. అందుకే చెప్పగలను. ముఖం చూస్తే చాలు నయమవుతుందో లేదో, లేకపోతే ఎంతకాలం అవ్వవచ్చో చెప్పగలను.

నేనెప్పుడూ పొరపాటు పడలేదు. టెంపుల్‌టలన్ రెండేళ్ల కంటే బతకడు!" మెక్లాడ్ ఆషెన్‌డెన్ వంక సాలోచనగా చూశాడు.

అతని ఆలోచన పసిగట్టిన ఆషెన్‌డెన్ వేడుగ్గా అతని వంక చూశాడు.

కానీ, అతని గుండె చిక్కపట్టకపోలేదు. ఆషెన్‌డెన్ మనసులోని ఆలోచన గుర్తించకపోలేదు. మెరుస్తూన్న కళ్లతో అతని వంక చూసిన మెక్లాడ్. "నీకేం భయంలేదు. నీకు నయమైపోతుంది. నాకు నిశ్చయంగా తెలియకపోతే నేనా మాట చెప్పను. తన రోగిష్టి పక్షులను భయపెడుతున్నానని డాక్టర్ లెన్నాక్స్ బయటకు తోలేస్తాడేమోననే కానీ, లేకపోతే..."

అంతలో ఆషెన్‌డెన్ నర్సు వచ్చింది, అతన్ని బెడ్‌కు తీసుకువెళ్లటానికి. అతనక్కడ కూర్చుంది ఓ గంటే కానీ, అలసిపోయాడు. మళ్లీ బ్లాంకెట్ల మధ్య పడుకోవడం హాయిగా ఉంది అతనికి. సాయంత్రం చూట్టానికి విచ్చిన డాక్టర్ లెన్నాక్స్ అతని టెంపరేచర్ ఛార్ట్ వంక చూసి, "పర్లేదు, బానేవుంది" అన్నాడు.


లెన్నాక్స్ కుదిమట్టంగా, చురుగ్గా, దయగా ఉండే మనిషి. అతను మంచి డాక్టరు, అంత కంటే మంచి వ్యాపారస్తుడు, చేపలు పట్టటం అతనికి వ్యసనం. చేపలు పట్టే ఋతువులో తన పనిని అసిస్టెంట్లకప్పజెప్పి అతను చేపలు పట్టటానికి వెళ్లేవాడు. పేషెంట్లు గొణిగేవాళ్లు కానీ, అతను తెచ్చిన లేత సాల్మన్ చేపలకూరతో భోజనంలో మార్పు వచ్చేటప్పటికి సద్దు మణిగేవారు. లెన్నాక్స్ మాట్లాడటమంటే ఇష్టం. అందుకే ఆషెన్‌డెన్ బెడ్ చివరన నిలబడి ఆ మధ్యాహ్నం ఎవరితోనైనా పరిచయమైందా అని అడిగాడు. మెక్లాడ్‌ను నర్సు తనకు పరిచయం చేసిందని ఆషెన్‌డెన్ అతనికి చెప్పాడు.

డాక్టర్ లెన్నాక్స్ నవ్వాడు. "చిరకాల కాపురస్థుడు. శానటోరియం గురించీ, రోగుల గురించీ అతనికి నాకంటే బాగా తెలుసు. అతనికి సమాచారం ఎలా అందుతుందో నాకు తెలియదు కానీ, ఇక్కడున్న వాళ్లందరి ప్రైవేటు జీవితాన్ని గురించి అతనికి తెలియనిదేం లేదు. ఎక్కడ ఏ భాగోతం నడుస్తుందో వాసన పట్టే ముసలి దాది కంటే కనాకష్టం. కాంబెల్ సంగతి చెప్పాడా అతను?"

"ఆఁ, పేరు చెప్పాడు."

"ఇద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకి ద్వేషం. ఇద్దరూ ఇక్కడ పదిహేడేళ్ల బట్టీ ఉంటున్నవాళ్లే. ఇద్దరికీ ఒక్క ఊపిరితిత్తి మాత్రమే బాగా పని చేస్తుంది. ఒకరి నీడంటే ఒకరికి పడదు. ఇద్దరూ ఫిర్యాదులు చేస్తూ వస్తారు నా దగ్గరికి. నేను వినటం మానేశాను. కాంబెల్ గది, మెక్లాడ్ గది కిందే. కాంబెల్ ఫిడేల్ వాయిస్తుంటాడు. ఫిడేల్ వాద్యమంటే మంట మెక్లాడ్‌కు. పాడిందే పాటగా పదిహేనేళ్ల నుంచి అవే గీతాలూ, రాగాలూ వింటున్నానంటాడు మెక్లాడ్. ఎవరికీ నిద్రాభంగం కలగకుండా మిగతాప్పుడు అతను వాయించుకుంటుంటే, అతన్ని మానెయ్యమని చెప్పే హక్కు నాకెక్కడుంది? అందుకే మెక్లాడ్ గది మారుస్తానని చెప్పాను. అందు కొప్పుకోలేదు అతను. అది మంచి గది, తన్నాగదిలో నుంచి బయటికెళ్లగొట్టటానికే కాంబెల్ ఫిడేలు వాయిస్తున్నాడంటాడు. తన్ను బయటికెళ్లగొట్టి వాడు తన గది నాక్రమిస్తే ఛస్తాడంటాడు. విచిత్రంగా లేదూ? ఇద్దరు మధ్యవయస్కులు ఇలా ఒకరి జీవితం మరొకరు నరకం చేయటం. ఒకర్ని విడిచిపెట్టి మరొకరుండరు. ఒకే టేబుల్ దగ్గర భోజనం చేస్తారు, కలిసి బ్రిడ్జ్ ఆడతారు. అయినా, గొడవ పడకుండా రోజు గడవదు. మీరు సర్దుకుని ఉండకపోతే ఇద్దర్నీ బయటికి పంపేస్తానని చాలా సార్లు వాళ్లని బెదిరించాను కూడా. రెండు రోజులు ప్రశాంతంగా ఉంటారు. వాళ్లకు వెళ్లటం ఇష్టం లేదు. ఇక్కడ వాళ్లు ఎంత కాలం ఉన్నారంటే బయట వాళ్లని పట్టించుకునేవాళ్లే లేరు. ఇప్పుడు బయటి ప్రపంచంలో వాళ్లు నెగ్గుకురాలేరు. కొన్నేళ్ల క్రితం రెండునెల్లు సెలవు తీసుకుని వెళ్లాడు కాంబెల్. వారంలో తిరిగి వచ్చాడు. బయటి గోల తను భరించలేట్ట. వీథుల్లో జనాన్ని చూసి భయం వేసిందట."

అలా ఆషెన్‌డెన్‌కు కొత్త ప్రపంచంతో పరిచయమైంది. అతని ఆరోగ్యం మెరుగవుతుంటే, అతను మిగతా రోగుల్ని కలుసుకోసాగాడు. ఓ రోజు పొద్దున్న తనింక డైనింగ్ రూంలో లంచ్ చేయవచ్చని డాక్టర్ లెన్నాక్స్ అతనికి చెప్పాడు. అదో పెద్ద గది, ఎన్నో కిటికీలు; వాతావరణం బాగా ఉన్నరోజు ఎండ లోపలికి పడేటట్లు కిటికీలను తెరచి ఉంచేవారు. అక్కడ అతనికి చాలామంది మనుషులు కనిపించారు. వాళ్లను గుర్తించటానికి అతనికి కొంత సమయం పట్టింది. అన్ని రకాల వయసువాళ్లూ-యువకులు, మధ్యవయస్కులు, ముసలివాళ్లు ఉన్నారు. మెక్లాడ్, కాంబెల్‌లలాగా అక్కడే ఎంతో కాలంగా వుంటూ, అక్కడే చనిపోవాలని అనుకుంటూండేవాళ్లూ వున్నారు. కొద్ది నెలల క్రితమే వచ్చిన వాళ్లున్నారు. మిస్ ఐట్కిన్ అనే ముసలికన్య కూడా ఉంది. కొన్నేళ్ల నుంచి చలికాలంలో అక్కడ గడుపుతూ, వేసవికాలంలో బంధుమిత్రులతో గడుపుతుంది. ఆమెను గురించి ఆమెకేంలేదు. అక్కడే పూర్తికాలం కాలం ఉండొచ్చు. కానీ, ఇక్కడి జీవితమంటే ఇష్టం ఆమెకు. దీర్ఘకాలం ఇక్కడ ఉండటం వల్ల ఆమెకో హోదా వచ్చింది. ఆమె ఆనరరీ లైబ్రేరియన్‌గా వ్యవహరించేది. మాట్రన్‌తో చేతులు కలిపేది. కబుర్లకు ఆమె ఎప్పుడూ సంసిద్ధమే. అయితే, మీరు చెప్పేదంతా మరుక్షణంలో బయటికి పోతుందని మీరు త్వరలోనే గ్రహించి జాగ్రత్త పడతారు. తన పేషెంట్లు బాగా ఉంటున్నారని తెలుసుకోవడం డాక్టర్ లెన్నాక్స్‌కు అవసరం. ఎలాంటి అవివేకపు పనులూ చేయటంలేదనీ, తన ఆదేశాన్ని పాటిస్తున్నారనీ తెలుసుకోవాలి అతను. మిస్ ఐట్కిన్ కళ్లబడకుండా ఏదీ ఉండదు. ఆమె నుంచి మాట్రన్‌కూ, మాట్రన్ నుంచి డాక్టరుకూ సమాచారం అందేది. ఆమె ఎన్నో ఏళ్ల నుంచి అక్కడికి వస్తుంది కనుక, ఆమె కూడా మెక్లాడ్, కాంబెల్‌ల టేబుల్ దగ్గరే భోజనానికి కూర్చునేది; మరో ముసలి జనరల్ కూడా అక్కడ కూర్చునేవాడు. హోదా రీత్యా



అతనికా స్థానం ఇచ్చారు. మిగతా టేబుళ్ల కంటే అదేం భిన్నమైంది కాదు, లేక అనుకూలమైన జాగాలో వేసిందీ కాదు. కానీ పాతకాపులంతా అక్కడే తిష్ఠ వేస్తారు కనుక ఆ టేబుల్ కంత గౌరవం, వాంఛనీయస్థానం అయిపోయింది. అయితే, ప్రతి వేసవికాలంలోనూ నాలుగైదు నెలలు మాత్రం అక్కడ ఉండి వెళ్లే మిస్ ఐట్కిన్‌కు, సంవత్సరమంతా ఉండే తమను కాదని, ఆ గౌరవస్థానం ఇవ్వటం, తాము వేరే టేబుళ్ల దగ్గర కూర్చోవలసిరావటం కొంత మంది పెద్దవయసు స్త్రీలకు కష్టమనిపించింది. మెక్లాడ్, కాంబెల్‌ల తర్వాత దీర్ఘకాలం నుంచి అక్కడే ఉంటున్న ఓ ఇండియన్ సివిలియన్ ఉన్నాడు. అతడు తనకాలంలో ఓ ప్రావిన్సును పరిపాలించినవాడు. అతను మహాకినుకగా ఎదురుచూస్తున్నాడు, మెక్లాడ్, కాంబెల్‌లలో ఎవరో ఒకరి మృతి కోసం. అప్పుడతను మొదటి టేబుల్ దగ్గర స్థానం సంపాదించుకోగలడు. ఆషెన్‌డెన్, కాంబెల్‌లతో పరిచయం కూడా చేసుకున్నాడు. బట్టతల, సన్నటి మనిషి. అతన్ని చూస్తే కాళ్లూ, చేతులూ ఒక దగ్గర ఎలా ఉంచుకున్నాడా అని ఆశ్చర్యం వేస్తుంది. కుర్చీలో అవయవాలు ముడుచుకుని అతను గువ్వలా కూర్చునే పద్ధతి చూస్తే తోలుబొమ్మలాటలో మరుగుజ్జు గుర్తుకువస్తాడు. అతను విరసంగా మాట్లాడే మనిషి. ముట్టుకుంటే మీద పడి, కరిచేటట్టు ఉంటాడు, పరిచయం కాగానే అతను ఆషెన్‌డెన్‌కు "నీకు సంగీతమంటే ఇష్టమా?" అని అడిగాడు.

"అవును."

"ఇక్కడ ఒక గాడిద కిష్టంలేదు. నేను వయొలిన్ వాయిస్తాను. నీకిష్టమైతే నా గదికి రా. నీకు వాయించి వినిపిస్తాను."

అతని మాటలు విన్న మెక్లాడ్, "వెళ్లకు, అదో పెద్దహింస" అన్నాడు.

"అంత పరుషంగా మాట్లాడతావెందుకూ? కాంబెల్ బానే వాయిస్తాడు" అంది మిస్ ఐట్కిన్.


"ఈ దరిద్రపుజాగాలో రాగాల్లో తేడా తెలిసిన ఒక్క గాడిద లేదు" అన్నాడు కాంబెల్.

అవహేళనగా నవ్వుకుంటూ మెక్లాడ్ అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు. మిస్ ఐట్కిన్ పరిస్థితిని ప్రశాంతపరచ ప్రయత్నించింది. "మెక్లాడ్ అన్నదానికి నువ్వేం బాధపడకు" అన్నది.

"అతడి సంగతా? ఎప్పుడో ఒక రోజు ఇంతకింతా చేస్తాను!"

ఆ రోజు మధ్యాహ్నమంతా మళ్లీ మళ్లీ అతను ఒకే గీతాన్ని వాయించాడు. మెక్లాడ్ నేలను కాలితో తన్నాడు. కాంబెల్ పట్టించుకోలేదు. తనకు తలనొప్పిగా ఉందనీ, వాయించడం ఆపమనీ దాది చేత కబురుచేశాడు. వాయించే హక్కు తనకు ఉందనీ, ఇష్టం లేకపోతే ఏడ్చి చావమనీ చెప్పి పంపాడు కాంబెల్. అ తర్వాత వాళ్లిద్దరూ కలుసుకున్నప్పుడు ఇద్దరిమధ్యా పెద్ద వాగ్యుద్ధమైంది.

ఐవీ బిషప్, టెంపుల్‌టన్, ఓ లండను ఎకౌంటెంట్ హెన్రీ ఛెస్టర్లు కూర్చునే టేబుల్ దగ్గర ఆషెన్‌డెన్‌ను కూర్చోబెట్టారు. విశాలమైన భుజాలు, దృఢంగా ఉన్నట్టు కనిపిస్తాడు హెన్రీ. అతనికి క్షయవ్యాధని గుర్తించటం కష్టం. అది అతన్ని అకస్మాత్తుగా సోకింది, అశనిపాతంలా. అతను సామాన్యగృహస్థు. పెళ్లాం, ఇద్దరు పిల్లలు. ముప్పయి నలభైల మధ్య వయసు. ఊరి శివారు కాలనీలో ఉండేవాడు. పొద్దున నగరానికి వెళ్తూ ఉదయం పేపరు చదివేవాడు. సాయంత్రం ఇంటికొస్తూ సాయంత్రం పేపరు చదివేవాడు. తన కుటుంబం, తన వ్యాపారం తప్ప అతనికి వేరే ఆసక్తులేవీ లేవు. తన పని పట్ల అతని కెంతో ఇష్టం. సుఖంగా బతకటానికి కావలసిన డబ్బు సంపాదించేవాడు. ప్రతియేటా కొంత డబ్బు వెనకేసేవాడు. ప్రతి శనివారం మధ్యాహ్నం, ఆదివారం గోల్ఫ్ ఆడేవాడు. ప్రతి ఆగస్టులోనూ మూడు వారాల సెలవు మీద తూర్పు తీరప్రాంతాలకు వెళ్లేవాడు. పిల్లలు పెరిగి పెద్దయ్యాక, వాళ్లకు పెళ్లి చేస్తాడు. కొడుక్కు వ్యాపారం అప్పజెప్పేసి, భార్యతో ఊళ్లో ఉన్న ఇంట్లో మృత్యువు వచ్చేదాకా విశ్రాంతజీవనం గడుపుతాడు. అతను జీవితం నుంచి అంత కంటే ఎక్కువ ఆశించిందిలేదు. తనలాంటి వేలమంది జనం తృప్తిగా గడిపే జీవితమే అతను కోరుకున్నది. అతను సగటు పౌరుడు. అప్పుడీ దుర్ఘటన సంభవించింది. గోల్ఫ్ ఆడేప్పుడు జలుబు చేసింది, అది గుండెకు పాకింది. విపరీతంగా దగ్గసాగాడు. అతను బలంగా, ఆరోగ్యంగా ఉండే మనిషి, ఎప్పుడూ డాక్టరును చూసినవాడు కాడు. భార్య పోరు పెట్టాక, అతనికి డాక్టరు దగ్గరకు వెళ్లక తప్పలేదు. అదో పెద్ద షాకు, భయంకరమైన షాకు. అతని రెండు ఊపిరితిత్తులకూ వ్యాధి సోకింది. అతను వెంటనే శానటోరియంలో చేరితే బతికే అవకాశం ఉంది. రెండేళ్లలో నయమై మళ్లీ తన పని తాను చేసుకోవచ్చని చెప్పాడు అప్పుడా స్పెషలిస్టు. రెండేళ్లు గతించాయి గానీ, డాక్టర్ లెన్నాక్స్ మరో ఏడాది దాకా ఆ అలోచన పెట్టుకోవద్దని చెప్పాడు. ఉమ్మిలో క్షయజీవుల్ని అతనికి చూపాడు. ఎక్స్-రేలో వ్యాధి ఉన్న ప్రాంతాలు చూపాడు. అతనికి గుండె జారిపోయింది. క్రూరవిధి నిర్దయగా తనతో ఆడుతున్న నాటకమది అని అతని కనిపించింది. తను తాగితందనాలాడో, జులాయిలాగా ఆడాళ్లతో తిరిగో, రాత్రి పూట నిద్ర కాచో ఆరోగ్యం చెడగొట్టుకున్నట్టయితే అది అతను అర్థం చేసుకోగలిగి ఉండేవాడు. తనకే పాడు అలవాట్లూ లేవు. ఇది తన పట్ల జరిగిన దుర్మార్గం. అతనికి పుస్తకాలన్నా, మరేదన్నా ఆసక్తి లేదు. అందుకే ఎప్పుడూ తన ఆరోగ్యం సంగతే ఆలోచించేవాడు. తన రోగలక్షణాల్ని దిగులుగా పరిశీలించుకునేవాడు. రోజుకో డజను సార్లు టెంపరేచరు చూసుకుంటున్నాడని థర్మామీటరు అతన్నుంచి తీసేసుకున్నారు. తన వ్యాధి విషయంలో డాక్టరు సరైన చికిత్స చేయడం లేదని అతను తన



బుర్ర కెక్కించుకున్నాడు. డాక్టరు తనకు శ్రద్ధగా చికిత్స చేయటం కోసం టెంపరేచరు భయపెట్టేట్టు పెరిగే అన్ని ప్రయత్నాలు చేసేవాడు, ఆ ప్రయత్నాలు ఫలించనప్పుడు అతను ముఖం ముడుచుకునేవాడు. మాట్లాడితే పోట్లాటకు దిగేవాడు. స్వభావరీత్యా అతను కులాసాగా, స్నేహపూర్వకంగా ఉండే మనిషి, తనను గురించి మరిచిపోయినప్పుడు హాయిగా మాట్లాడేవాడు, ఆనందంగా నవ్వేవాడు. అప్పుడతనికి గుర్తుకు వచ్చేది తను వ్యాధిగ్రస్తుడనని... అతని కళ్లల్లో మృత్యుభయం తారట్లాడేది.

ప్రతి నెల చివరా అతని భార్య ఒకటి రెండు రోజులు పక్కనున్న లాడ్జింగ్ హౌస్‌లో దిగేది. రోగులనిలా బంధువులొచ్చి చూడటం డాక్టర్ లెన్నాక్స్‌కు ఇష్టముండేది కాదు. అది వాళ్లను ఆవేశానికి గురి చేస్తుంది, అస్థిరులను చేస్తుంది అని అతని భావన. భార్య రాక కోసం హెన్రీ ఛెస్టర్ ఆత్రుతగా ఎదురుచూడటం గుండె కదలిపోయేట్టుగా ఉండేది. అయితే ఆమె వచ్చాక, ఎదురుచూసినంత ఆనందం అతని కుండేది కాదు. ఛెస్టర్ భార్య మంచిమనిషి, అందంగా లేకపోవచ్చు, తన భర్తలాగే సాధారణగృహిణి కావచ్చు. కాని ఆమెను చూస్తే అర్థమవుతుంది అనుకూలవతి అయిన భార్య అనీ, ప్రేమించే పిల్లలతల్లి అనీ, పొదుపుగా ఖర్చు పెట్టే ఇల్లాలు అనీ, ఇతరుల విషయాల్లో జోక్యం కలిగించుకోని స్త్రీ అనీ. సాధారణ గృహస్థజీవితంలో ఆమెకు సంతృప్తి ఉంది. ఎప్పుడో ఓ సినిమాకు వెళ్లటం, లండను సిటీ షాపుల్లో ఎప్పుడో ఓ సారి బట్టలు కొనుక్కోవటం ఆమె జీవితంలో ఆనందం కలిగించిన సంఘటనలు. మార్పు లేని యాంత్రికజీవనం అని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఆమెకు తన జీవితం పట్ల తృప్తి ఉంది. ఆషెన్‌డెన్‌కు ఆమె అంటే ఇష్టం కలిగింది. ఆమె మురిపంగా తన పిల్లల్ని గురించి చెప్పినప్పుడూ, తన ఇల్లు, పొరుగువాళ్లు, తను రోజూ చేసే పనుల గురించి చెప్తున్నప్పుడూ అతను ఆసక్తిగా విన్నాడు.

అతను ఆమెనోసారి రోడ్డు మీద కలిశాడు. హెన్రీ వేకు ట్రీట్‌మెంటు జరుగుతోంది. అతను బయటికి రాలేకపోయాడు. ఆమె ఒంటరిగా ఉంది. ఇద్దరూ కలిసి రోడ్డు మీద వెళ్లసాగారు. ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నారు కాస్సేపు. అప్పుడామె అకస్మాత్తుగా తన భర్త ఎలా ఉన్నాడని తననుకుంటున్నాడని అడిగింది.

"అతను బాగానే కోలుకుంటున్నాడని నాకనిపిస్తోంది."

"నాకెంతో దిగులుగా ఉంది."

"ఇది మెల్లగా, దీర్ఘకాలం సాగే చికిత్స. ఓర్పుండాలి."

ఇంకా కొద్దిదూరం నడిచాక ఆమె ఏడవటం కనిపించిందతనికి.

"అతన్ని గురించి నిజానికి దిగులు పడాల్సిందేం లేదు" అన్నాడు ఆషెన్‌డెన్ మృదువుగా.

"మీకు తెలీదు. నేనిక్కడికి వచ్చినప్పుడు అతనితో వేగలేకపోతున్నాను, ఆ విషయం నేను మీతో మాట్లాడకూడదు. నాకు తెలుసు. అయినా తప్పదు. మిమ్మల్ని విశ్వసించేదా?"

"తప్పకుండా."

"అతనంటే నాకెంతో ప్రేమ. అతన్ని నేను ఆరాధిస్తాను. ఈ ప్రపంచంలో అతని కోసం నేను చేయంది లేదు. మేం ఎప్పుడూ పోట్లాడుకుంది లేదు. ఏ ఒక్కవిషయం గురించీ భిన్నాభిప్రాయాలు కూడా లేవు. అతనిప్పుడు నన్ను అసహ్యించుకోవడం మొదలెట్టాడు. అది నా గుండె ముక్కలు చేస్తోంది."

"అయ్యో, నాకు నమ్మకం కలగటం లేదు. మీరిక్కడ లేనప్పుడు నిత్యం మీ గురించే చెప్తుంటాడు. అంత కంటే భార్యను గురించి ఎవరూ చెప్పరు. అతనికీ మీరంటే ఆరాధనే."

"అవును, నిజమే. అది నేనిక్కడ లేనప్పుడు. నేనిక్కడికి వచ్చాక, నన్ను ఆరోగ్యంగా, బాగా చూశాకే అతనికి నా పట్ల అసహ్యం కలుగుతుంది. తను జబ్బు పడివుండటం, నేను కులాసాగా ఉండటం అతని కిష్టం లేదు. తను చచ్చిపోతానని అతనికి భయం. నేను బతికుంటానని అతనికి ద్వేషం. ప్రతి క్షణం నేను ఏమంటానోనని జాగ్రత్తపడాలి. నేను పిల్లల విషయం మాట్లాడినా, మా భవిష్యత్తును గురించి మాట్లాడినా అతనికి చిర్రెత్తుకొస్తుంది. అతను నన్ను గాయపరిచే మాటలు మాట్లాడతాడు. ఇంటి విషయం గానీ, పనివాణ్ని మార్చే విషయం గానీ మాట్లాడినా అతనికి ఆపుకోలేనంత చిరాకు కలుగుతుంది. తన్నింక లెక్కించదగిన మనిషి కాదని నేనన్నట్లు మాట్లాడతాడు. మేం కలిసిమెలిసి బతికాం. ఇప్పుడు మా మధ్య వైరభావన నెలకొని ఉంది. అతని నెపాన్ని ఎన్నగూడదని నాకు తెలుసు. ఆ జబ్బు వల్లే ఇదంతా వచ్చిందనీ తెలుసు, తను చాలా మంచిమనిషి అనీ నాకు తెలుసు. చాలా దయ కలిగిన మనిషి. ఎవర్నీ బాధపెట్టే మనిషి కాడు. కానీ, ఇప్పుడు ఇక్కడికి రావటమంటేనే భయమేస్తున్నది. వెళ్లిపోవటం సాంత్వన కలిగిస్తున్నది. నాకే కనుక క్షయవ్యాధి వస్తే అతనంత బాధపడేమనిషి మరొకరుండరు. కానీ, నాకు తెలుసు, అతని గుండె లోతుల్లో అతనికి సేదతీరినట్లవుతుందని. నేనూ చచ్చిపోతున్నానని అతననుకుంటే, అతను నన్ను క్షమించగలడు, విధిని క్షమించగలడు. ఒక్కోసారి, తను చనిపోయాక నేనేం చెయ్యాలో చెప్తూ నన్ను రంపపుకోత పెడ్తాడతను. నాకు ఏడుపొచ్చి అలా మాట్లాడొద్దంటే, కొన్ని రోజుల్లో చచ్చిపోయేవాడికి ఆ మాత్రం అనందమిస్తేనేం, నువ్వు ఏళ్ల తరబడి హాయిగా బతుకుతావుగా అంటాడు. అయ్యో, ఇన్నేళ్లూ ఒకటి పట్ల ఒకరికున్న మా ప్రేమ ఇంత హైన్యంగా, దైన్యంగా క్షీణించిపోవటం చూస్తే నాకెంతో భయం కలుగుతుంది."

హెన్రీ భార్య రోడ్డు పక్కనున్న ఓ బండ మీద కూర్చుని వెక్కిళ్లు పెట్టి ఏడవసాగింది. ఆషెన్‌డెన్ ఆమె వంక జాలిగా చూశాడు. కానీ



ఆమెకు గుండె దిటవునిచ్చే ఒక్క మాటా చెప్పలేకపోయాడు. ఆమె చెప్పిన మాటలు అతని కంతగా ఆశ్చర్యం కలిగించలేదు.

"ఓ సిగరెట్టివ్వండి" అందామె చివరకు. "నా కళ్లు ఎర్రగా, వాచివుంటే నేనేడుస్తూ ఉన్నానని హెన్రీ అనుకుంటాడు, తన్ను గురించి చెడువార్త విన్నాననుకుంటాడు. మృత్యువంత భయంకరమా? మనమంతా మృత్యువంటే అలా భయపడతామా?"

"నాకు తెలీదు" అన్నాడు ఆషెన్‌డెన్.

"మా అమ్మ చనిపోయేప్పుడు ఇంత భయపడిన ట్లనిపించలేదు నాకు. ఆమెకు తెలుసు అది వస్తోందని, దాన్ని గురించి హాస్యమాడింది కూడా. అయితే, ఆమె ముసలిది."

హెన్రీ భార్య ఇప్పటికి కొంత దిటవు చేసుకోగలిగింది. మళ్లీ నడవసాగారు నిశ్శబ్దంగా.

"నేను హెన్రీని గురించి చెప్పినందుకు అతను చెడ్డమనిషని మీరనుకుంటున్నారా?" అడిగిందామె చివరకు.

"లేదు, అలాంటిదేం లేదు."

"అతను మంచిభర్త, పిల్లలకు మంచి తండ్రి. నా జీవితంలో అతని కంటే మంచిమనిషిని నేను చూడలేదు. ఈ రోగం వచ్చేదాకా, ఒక్క పరుషపుమాట అని ఎరగడు, ఒక్క దుర్మార్గపు ఆలోచన అతని బుర్రలోకి రాలేదు."


ఈ సంభాషణ ఆషెన్‌డెన్‌ను ఆలోచనల్లో పడేసింది. మానవస్వభావం గురించి అతనికి తక్కువ అభిప్రాయం ఉందని జనం అంటూంటారు. తన చుట్టూ ఉంటే మనుషులను గురించి తను మామూలు ప్రమాణాల ప్రకారం తీర్పివ్వకపోవడమే అందుకు కారణం. ఇతరులను విభ్రమంలో ముంచెత్తిన విషయాలను అతను ఓ చిరునవ్వుతోనో, ఓ కన్నీటిబొట్టుతోనో స్వీకరించేవాడు. అలాంటి మామూలు, మంచిమనిషి గుండెలో చెడు ఆలోచనలు ఉన్నాయని ఆశించపోవటం నిజమే. కానీ, మనిషి ఎలాంటి లోతులకు పతనమవగలడో, ఎలాంటి ఎత్తులకు ఎక్కగలడో ఎవరు చెప్పగలరు? తప్పంతా అతని భావదారిద్ర్యంలో ఉంది. హెన్రీ ఛెస్టర్ అతిసాధారణ, సగటు జీవితం గడపటానికి పుట్టి పెరిగాడు. బతుకులో వచ్చే మామూలు ప్రత్యయాలకెదురయ్యాడు. కానీ, ఓ ఊహించని దుర్ఘటన జరిగేటప్పటికి దాన్ని ఎదుర్కొనే మార్గాలేవీ అతనికి తెలీవు. ఓ భవనం కట్టటంలో ఉపయోగించే వెయ్యి ఇటుకల్లో తన స్థానం ఆక్రమించాల్సిన ఒక ఇటుక లాంటి వాడతను. కానీ, అందులో లోపం వల్ల పనికిరాని ఇటుకై పోయినవాడు. ఇటుకకు కూడా మనసు ఉంటే ఏడ్చేది. నేనేం చేశాను, ఈ మామూలు పనికి కూడా పనికిరానిదాన్నయిపోయాను. నాకు ఆసరా ఇచ్చే ఆ మిగతా ఇటుకల నుంచి నన్ను తీసి, చెత్తకుప్ప మీద విసిరెయ్యాల్సిన దాన్నెందుకై పోయాను? తను చెయ్యగలిగిందేం లేదని తన దౌర్భాగ్యంతో రాజీపడి పోగలిగే భావన అతను చేయలేకపోయాడంటే అందులో హెన్రీ ఛెస్టర్ తప్పేం లేదు. అందరూ కళల్లోనో, ఆలోచనల్లోనో ఓదార్పు పొందలేరు. ఈ సాధారణజనం ఆశను కల్పించే భగవంతుడిలో విశ్వాసం కోల్పోవటమే ఈ కాలపు జీవితంలోని విషాదం. ఆ జాగాలో మరొకటి పొదుకోల్పలేకపోవటమే విషాదం.

కష్టాలు మనుషుల్ని పునీతం చేస్తాయనే మనుషులున్నారు. అది నిజం కాదు. సాధారణంగా అవి మనుషుల్ని అల్పులుగా, దెబ్బలాడే మనుషులుగా, స్వార్థపరులుగా తయారుచేస్తాయి. కానీ, ఇక్కడ ఈ శానటోరియంలో అన్ని కష్టాలు, బాధలు లేవు. క్షయవ్యాధి కొన్ని దశల్లో ఉండే జ్వరం మనిషిని దిగజార్చదు. ఆవేశపూరితుణ్ని చేస్తుంది. రోగి చురుగ్గా ఉంటాడు. ఆశతో పైకి తేలుతుంటాడు. భవిష్యత్తును ఉల్లాసంగా ఎదుర్కొంటాడు. అయితే, అప్పటికీ అంతశ్చేతనలో మృత్యుభావన అతన్ని వెన్నాడుతూనే ఉంటుంది.

ఆషెన్‌డెన్ శానటోరియంలో చేరిన కొద్ది కాలానికి ఓ ఇరవై యేళ్ల యువకుడు అక్కడికి వచ్చాడు. నేవీలో-సబ్‌మెరైన్‌లో సబ్‌లెఫ్టినెంట్‌గా పని చేసిన మనిషి. అతనిది మహోదూకుడు క్షయవ్యాధి. అతను పొడుగాటి మనిషి. చూపరి. రింగులజుట్టు, నీలికళ్లు, పెదాల మీద తియ్యటి చిరునవ్వు. అతను టెర్రస్ మీద ఎండలో పడుకుని ఉండగా రెండుమూడుసార్లు ఆషెన్‌డెన్ చూశాడు. ఓ రోజు అతనితో మాట్లాడాడు కూడా. అతను కులాసా యువకుడు. సంగీతం, పాటలు, సినిమా తారల గురించీ అతను మాట్లాడాడు. ఫుట్‌బాల్ ఫలితాల కోసం, బాక్సింగ్ వార్తల కోసం పేపర్లు చదివేవాడు. ఆ తర్వాత అతన్ని పక్క మీద నుంచి లేవనివ్వలేదు వాళ్లు. ఇంక ఆషెన్‌డెన్ అతన్ని చూడలేదు. బంధువుల్ని పిలిపించారు. రెండు నెలల్లో అతను చనిపోయాడు. నెపాలెన్నకుండానే అతను పోయాడు. పశువుకు తెలిసినట్లు తనకేమవుతుందో అతనికి తెలీదు. జైల్లో ఓ ఖైదీని ఉరి తీస్తే ఏర్పడే వాతావరణమే ఒకటి రెండురోజులు శానటోరియంలో నెలకొంది.

విశ్వజనీనమైన అంగీకారంలా, ఆత్మరక్షణ సహజాతానికి విధేయంగా ఆ యువకుణ్ని మనసు నుంచి తుడిచేశారు జనం. మూడు పూటలా తిండి, నియమించిన వ్యాయామం, విధించిన విశ్రాంతి, పోట్లాటలు, అసూయలు, చెవులు కొరుక్కోటాలు, చిరాకుల జీవితం ఎప్పటిలాగానే కొనసాగింది. కాంబెల్, మెక్లాడ్‌కు వినుగు పుట్టించే ఫిడేలు సాధన కొనసాగించాడు. బ్రిడ్జి ఆటలో తన ప్రావీణ్యం, ఇతరుల ఆరోగ్యం-వీటి గురించిన ముచ్చట్లను మెక్లాడ్ కొనసాగించాడు. మిస్ ఐట్కిన్ చాడీలు చెప్పటం మానలేదు. తన పట్ల డాక్టరు సరిగ్గా శ్రద్ధ చూపటం లేదని హెన్రీ ఛెస్టర్ ఫిర్యాదు చేశాడు. తనంతటి చక్కటి జీవితం గడిపాక కూడా విధి తన్ను వంచించిందని తిట్టాడు. ఆషెన్‌డెన్ తన చదువు కొనసాగించాడు, తన తోటి మనుషుల చిత్తచాంచల్యాన్ని వేడుగ్గా సహనంతో వీక్షించాడు.

(ముగింపు వచ్చేవారం)



(కిందటి సంచిక తరువాయి)


మేజర్ టెంపుల్ టెన్‌తో అతనికి సాన్నిహిత్యం పెరిగింది. అతనిది నలబై దాటిన వయసు. అతను గ్రెనడియర్ గార్డ్స్‌లో పనిచేశాడు. యుద్ధం అయ్యాక పదవీవిరమణ చేశాడు. డబ్బున్న మనిషి. జీవితాన్నుంచి సుఖాన్ని పిండుకోసాగాడు-అప్పటి నుంచీ. రేసింగ్ సీజన్లో రేసులాడాడు. షూటింగ్ సీజనులో షూటింగ్ చేశాడు. హంటింగ్ సీజనులో వేటాడాడు. అవయ్యాక మాన్ట్ కార్లోకు వెళ్లాడు. అక్కడ జూదంలో ఎంతో డబ్బు పోగొట్టుకున్నాడు. అతనికి అమ్మాయిలంటే ఇష్టం. మనం అతని కథలు నమ్మితే, వాళ్లకే అతనంటే ఇష్టం. అతనికి మంచి ఆహారం, చక్కటి డ్రింకు అంటే ఇష్టం. లండనులోని మంచి రెస్టారెంట్లన్నిటిలో హెడ్ వెయిటర్ల పేర్లన్నీ అతనికి తెలుసు. అరడజను క్లబ్బుల్లో అతను సభ్యుడు. అలా వ్యర్థంగా, ప్రయోజనరహిత స్వార్థపరజీవితం సంవత్సరాలు గడిపాడు. భవిష్యత్తులో బతక అసాధ్యమైన జీవితం గడిపాడు. ఎలాంటి సందేహాలూ లేకుండా జీవితాన్ని ఎంజాయ్ చేశాడు. మళ్లీ తన పూర్వజీవితం తనకు లభిస్తే తనేం చేస్తాడని ఆషెన్‌డెన్ అతన్ని అడిగాడు. తనంతకు ముందు చేసిన పనే చేస్తానని అతను జవాబిచ్చాడు. అతను చక్కగా మాట్లాడతాడు, ఆకట్టుకుంటాడు. ఆనందంగా, వ్యంగ్యంగా మాట్లాడతాడు. విషయాలను గురించి లోతుగా కాక కాస్త కాస్త మాత్రమే అతనికి తెలుసు. వాటిని గురించే కులాసాగా మాట్లాడతాడు. శానటోరియంలోని వృద్ధకన్యలతో నవ్విస్తూ కబుర్లు చెప్తాడు. ముఖం ముడుచుకునే ముసలాళ్లతో హాస్యం చేసేవాడు. బాగా డబ్బుండి, దాన్ని ఏం చేయాలో, తెలియని జనప్రపంచంలోకి ఎలా ప్రవేశించాలో అతనికి తెలుసు. అతను బెట్లు కడతాడు. స్నేహితులకు సాయం చేస్తాడు. దొంగ వెధవకు తెలిసీ ఓ పది ఇస్తాడు. అతను ప్రపంచానికి అంతా మంచి చెయ్యకపోయినా కీడు కూడా చెయ్యలేడు. అతను గొప్పవాడు కాదు. శీలం, ప్రశంసించే లక్షణాలున్న అనేకుల కంటే మంచి స్నేహితుడు. అతనికి వ్యాధి ముదిరింది. తను చనిపోతున్నాడన్న సంగతి అతనికి తెలుసు. జీవితంలో మిగతా విషయాలన్నీ ఎలా నవ్వుతూ స్వీకరించాడో, దీన్నీ అలాగే అంగీకరించాడు. క్షయవ్యాధి రావటం దురదృష్టం. పోనీ, వస్తే వచ్చింది. ఎవడూ అనంతంగా బతకలేడుగా! నిజమాలోచిస్తే తన ప్రాణం యుద్ధంలో కూడా పోయుండొచ్చు. ఓడిపోయే పందెం వేశాం. డబ్బు చెల్లించు, మరిచి పో దాని సంగతి. అదీ అతని జీవితసూత్రం. డబ్బున్నందుకు హాయిగా ఖర్చుపెట్టాడు. జీవితం అయిపోయిందన్నా అతను సిద్ధమే. నడుస్తున్నంతసేపూ అది మంచిపార్టీనే, కానీ ఏ పార్టీ అయినా ముగింపులోకి రావాల్సిందే. పార్టీ నుంచి మర్నాడు పొద్దునైనా హాయిగా ఇంటికి వెళ్లొచ్చు. లేదూ పార్టీ జరుగుతున్నప్పుడే వెళ్లిపోవచ్చు.

శానటోరియంలో ఉన్న జనమందరిలోకీ నైతికదృష్టిలో అతను కనిష్ఠుడు. కానీ అనివార్యమైన దాని కోసం శోకించనివారిలో గరిష్ఠుడతను. అతను మృత్యువునే ఎదిరించాడు. దాన్ని మీరు తగని తేలికరకం అనొచ్చు. లేదూ లెక్కలేనితనాన్ని వీరత్వమూ అనవచ్చు.

# శానటోరియం

ఆంగ్లమూలం:
విలియం సోమర్‌సెట్ మామ్

అనువాదం:
కాకాని చక్రపాణి



అతను శానటోరియానికి వచ్చినప్పుడు, తనంతగా ప్రేమలో కూరుకుపోతాడని ఊహించలేదు. అతనంతకు ముందు ఎందర్నో ప్రేమించాడు. కాని అవన్నీ పైపై ప్రేమలే. కోరస్ అమ్మాయిల కాసుప్రేమలోనూ, పార్టీల్లో గాలంలో పడే తేలిక స్త్రీలతోనూ అతను సంతృప్తిపడ్డాడు. తన స్వాతంత్ర్యాన్ని హరించే బంధనాల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తపడ్డాడు. సెక్సుకు సంబంధించి వీలైనంత ఆనందాన్ని జుర్రుకోవడమే అతని జీవితలక్ష్యం. అనంతవైవిధ్యంలో అతనికి అనుకూలతే కనిపించింది కానీ అసౌలభ్యం అనిపించలేదు. కానీ, అతనికి స్త్రీలంటే ఇష్టం. ముసలివాళ్లతో మాట్లాడినా అతని గొంతులో మార్దవం, ప్రేమ ధ్వనిస్తాయి. వాళ్లను సంతోష పెట్టడానికి ఏది చేయటానికైనా అతను వెనుకాడడు. ఆ ముసలిస్త్రీలకు తెలుసు-అతనికి తమ పట్ల వున్న ఆసక్తి, అవసరమైనప్పుడు వెనకడుగువేయడని వాళ్ల పొరపాటు నమ్మకం. అతను ఆషెన్‌డెన్‌తో ఓ సారి చెప్పిన మాటల్లో అతని మనఃప్రవృత్తి గోచరించింది. "మీరు కోరుకున్న ఆడది మాటల్లో పడుతుంది. గట్టిప్రయత్నం చెయ్యాలి అంటే. అయితే, ఓ సారి మీ చేతిలో పడ్డాక, స్త్రీలపట్ల నిజంగా సానుభూతి వున్న మనిషి మాత్రమే, అవమానపరచకుండా ఆమెను వదిలించుకోగలడు. మిగతావాళ్ల కది కష్టం."

అతను అలవాటు చొప్పున ఐవీ బిషప్‌ను ప్రేమించసాగాడు. శానటోరియంలో అందరి కంటే చిన్నదీ, అందమైనదీ కూడా ఆమె. మొదట్లో ఆషెన్‌డెన్ అనుకున్నంత చిన్నది కాదు. ఆమె వయసు ఇరవై తొమ్మిది, కిందటి ఎనిమిదేళ్ల నుంచి ఒక శానటోరియం నుంచి మరో శానటోరియానికి తిరుగుతున్నదామె. స్విట్జర్లెండు, ఇంగ్లాండు, స్కాట్‌లాండుల్లో అన్ని శానటోరియాలూ చూసింది. పని లేని ఆశ్రమజీవితం ఆమె అందాన్ని కాపాడింది. ఇరవై ఏళ్ల వయసు కంటే ఎక్కువ వున్నదానిలా కనిపించదు. తను ప్రపంచాన్ని గురించి తెలుసుకున్నదంతా ఈ శానటోరియంలోనే. అందుకే ఆమెలో మహా అమాయకత్వం, మహానాగరకతా కలిసి ద్యోతకమవుతూ ఉంటాయి. ప్రేమభాగోతా లెన్నో ఆమె చూసింది. రకరకాల దేశస్థులు ఆమె ప్రేమలో పడ్డారు. ఆత్మనిగ్రహంతోనూ, సరదాగానూ ఆమె వాళ్ల ప్రేమ నంగీకరించింది. అయితే, వాళ్లు మరీ దూరంగా పోకుండా ఆమె జాగ్రత్త పడేది. పూలబాలలాగా వున్నా, సమయమొచ్చినప్పుడు తన మాటల్ని ఎంత స్పష్టంగా, కచ్చితంగా చెప్పాలో చెప్పగలిగే వ్యక్తిత్వం ఆమెలో ఉంది. జార్జి టెంపుల్‌టన్‌తో సరాగానికి ఆమె సిద్ధపడేవుంది. అది ఆట అని ఆమెకు తెలుసు. అతని పట్ల సొగసులు కురిపించకపోలేదు. అయితే, తనాతన్ని పూర్తిగా అంచనా వేసిందనీ, అతనిలాగా తనూ ఈ భాగోతాన్ని మనసుకు పట్టించుకోదనీ సరాగపుమాటలతో చెప్పకనే చెప్పింది. ఆషెన్‌డెన్‌లాగా, టెంపుల్‌టన్ కూడా సాయంత్రం ఆరు గంటలకల్లా పడక చేరేవాడు, తన గదిలోనే భోజనం చేసేవాడు. అందువల్ల అతను పగటిపూటే ఐవీని చూడటం సాధ్యపడేది. ఇద్దరూ కలిసి నడచివెళ్లేవాళ్లు. ఎప్పుడో కానీ ఒంటరిగా ఉండేవాళ్లు. లంచ్ సమయంలో

పని లేని ఆశ్రమజీవితం ఆమె అందాన్ని కాపాడింది. ఇరవై ఏళ్ల వయసు కంటే ఎక్కువ వున్నదానిలా కనిపించదు. తను ప్రపంచాన్ని గురించి తెలుసుకున్నదంతా ఈ శానటోరియంలోనే. అందుకే ఆమెలో మహా అమాయకత్వం, మహానాగరకతా కలిసి ద్యోతకమవుతూ ఉంటాయి. ప్రేమభాగోతా లెన్నో ఆమె చూసింది.



నలుగురూ-ఐవీ, టెంపుల్‌టన్, హెన్రీ చెస్టర్, ఆషెన్‌డెన్ ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకునేవారు. టెంపుల్‌టన్ ఆహ్లాదంగా ఆకట్టుకునేట్టు కబుర్లు చెప్పేవాడు. అయితే, ఆ ప్రయత్నమంతా మగవాళ్ల కోసం కాదు-అన్నది స్పష్టమే. ఇప్పుడు అతను ఐవీతో సరసాలస్థాయి దాటినట్టు ఆషెన్‌డెన్‌కు అనిపించింది. అతని ప్రేమలో నిజాయితీ, గాఢతా కనిపించసాగాయి. ఆ విషయం అతను చెప్పలేకపోయాడు. ఆమె అది గుర్తించిందో లేదో, అందులో ఆమెకి స్వారస్యం కనిపించిందో లేదో. సందర్భానికి అనుచితంగా అతను సన్నిహితంగా ఏదో అనేవప్పటికి, ఆమె అందరికీ నవ్వొచ్చేట్టుగా దాన్ని వ్యంగ్యంతో తేల్చిపారేసింది. టెంపుల్‌టన్ విచారంగా నవ్వాడు. తన్నామె ప్లే బాయ్‌గా పరిగణించటం అతనికి తృప్తి కలిగించలేదు.

ఐవీతో పరిచయం పెరిగినకొద్దీ ఆమె అంటే అతని కిష్టం కూడా పెరగసాగింది. ఆమె రుగ్మతాగ్రస్తశరీరంలో విషాదసౌందర్యమేదో ఉంది. ఆ అందమైన పారదర్శకచర్మం, ఆ సన్నని ముఖంలో వెలిగే పెద్ద నీలికళ్లు, ఆమె పరిస్థితిలోనూ విషాదం ఉంది. శానటోరియంలోని చాలామందిలాగే ఆమె కూడా ప్రపంచంలో ఒంటరిది. ఆమె తల్లికి తీరుబాటు లేని సాంఘికజీవనం, అక్కాచెల్లెళ్లకు పెళ్లిళ్లయ్యాయి. తమ నుంచి ఎనిమిదేళ్ల క్రితం విడిపోయిన ఐవీ పట్ల వాళ్లకంత ఆసక్తి లేదు. వాళ్లు ఉత్తరాలు రాస్తారు, అప్పుడప్పుడు వచ్చి చూస్తారు. అయితే, వాళ్ల మధ్య మిగిలిందేదీ లేదు. కోపం, ద్వేషం లేకుండానే ఆమె ఆ పరిస్థితిని స్వీకరించింది. అందరితో స్నేహంగా ఉండేది. ఎవరు తమ బాధలు చెప్పుకున్నా ఓపిగ్గా, సానుభూతితో వినేది. తన ప్రవర్తనకు భిన్నంగా హెన్రీ చెస్టర్‌తో మెలిగేది, అతన్ని ఉల్లాసపరచటానికి ప్రయత్నించేది.

"చెస్టర్, నెల చివరికొచ్చింది. మీ భార్య మిమ్మల్ని చూడటానికి రేపు వస్తుంది. ఆమె రాక మీకానందం కలిగిస్తుంది" అందామె ఓ సారి లంచ్ చేసేటప్పుడు.

"లేదు, ఈ నెల ఆమె రావటం లేదు" అన్నాడతను మెల్లగా, ముందున్న ప్లేటు వంక చూస్తూ.

"అయ్యో! ఎందుకనీ? పిల్లలు బాగున్నారా?"

"ఆమె రాకపోతేనే నాకు మంచిదని డాక్టర్ లెన్నాక్స్ అనుకున్నాడు."

అందరూ నిశ్శబ్దమైపోయారు. ఐవీ అతని వంక బాధగా చూసింది.

"దురదృష్టం! డాక్టర్ లెన్నాక్స్

చెప్పకపోయాడా, ఆమె రావటం నీకనవసరమని!" అన్నాడు టెంపుల్‌టన్ తన మామూలు కులాసా ధోరణిలో.

"ఈ విషయాలు మన కంటే అతనికి బాగా తెలుసు" అన్నాడు హెన్రీ.

అతని వంక మరోసారి చూసి ఐవీ మరో విషయం వైపు దృష్టి మళ్లించింది.

వెనక్కి తిరిగి చూస్తే, ఆమె సత్యాన్ని గమనించిందని అర్థం చేసుకున్నాడు ఆషెన్‌డెన్. అతను మర్నాడు హెన్రీతో మాట్లాడాడు. "మీ భార్య రాకపోవటం నాకు విచారంగా ఉంది. అది మీకెంతో కష్టం కలిగిస్తుంది" అన్నాడతను.

"అవును, చాలా."

అతను ఆషెన్‌డెన్ వంక పక్కచూపులు చూశాడు. అతను ఏదో చెప్పాలనుకుంటున్నాడు, కానీ చెప్పకోలేకపోతున్నాడని అర్థమైంది ఆషెన్‌డెన్‌కి. అతను కోపంగా భుజాలు కుదించుకున్నాడు.

"ఆమె రాకపోవటం నా తప్పే. ఆమెను రావొద్దని లెన్నాక్స్‌కి చెప్పి నేనే రాయించాను. ఆమె రాక కోసం నెలంతా ఎదురుచూస్తాను, వచ్చాక ఆమెను ద్వేషిస్తాను. ఈ దరిద్రపుజబ్బు అంటే నాకు కోపం. ఆమె బలంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఆమె కళ్లల్లో బాధ చూసినప్పుడు నాకు పిచ్చెక్కుతుంది. నిజానికి నాకు జబ్బు చేస్తే ఆమెకేం? ఎవరికి లెక్క? వాళ్లు బాధను నటిస్తారు. జబ్బొచ్చింది నీకు గాని, వాళ్లను కాదని సంతోషపడతారు. నేనొట్టి పందివెధవని కదూ?"

అతని భార్య బండ మీద కూర్చుని ఏడ్చిన దృశ్యం ఆషెన్‌డెన్‌కు గుర్తుకొచ్చింది.

"ఆమెను రానివ్వకపోవటంతో ఆమెకు బాధ కలుగుతుందని మీకు తెలీదా?"

"తప్పదు. భరించాలి. నాకున్న దుఃఖం చాలు, ఆమె బాధను కూడా ఎక్కడ పట్టించుకునేది?"

ఆషెన్‌డెన్‌కు ఏం చెప్పాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాడు.

అమాంతం చిరాగ్గా హెన్రీ అన్నాడు-"మీరు అనాసక్తంగా, నిస్వార్థంగా ఉండటం మీకు బాగానే ఉంటుంది. ఎందుకంటే మీరు బతికివుంటారు కనుక. కానీ, నేను చావబోతున్నాను. చావటం నాకిష్టం లేదు. నేనెందుకు చావాలి? అది న్యాయం కాదు."

కాలం గడిచింది. శానటోరియం లాంటి జాగాలో విషయాలు దాగవు. జార్జి టెంపుల్‌టన్ ఐవీ బిషప్‌ను ప్రేమిస్తున్నాడని అందరికీ తెలిసిపోయింది. అయితే, ఆమె భావాలేంటో ఎవరికీ తెలీదు. అతను పక్కనుండటం ఆమెకిష్టమే, కానీ అందు కోసం ఆరాటపడలేదామె. ఆ పైన అతనితో ఒంటరిగా ఉండకుండా కూడా ఆమె ప్రయత్నం చేసింది. ఒకరిద్దరు ముసలి స్త్రీలు ఆమె మనసులో మాట రాబట్ట ప్రయత్నించారు. తెలివి గల ఆమె వాళ్ల కంతుచిక్కలేదు. వాళ్ల సూచనలను నిర్లక్ష్యం చేసింది, సీదా ప్రశ్నలు వేసినప్పటికీ నమ్మనట్టు నవ్వేసింది. దాంతో వాళ్లకు విసుగు పుట్టేసింది.

"తనంటే అతనికి పిచ్చని గమనించనంత మూర్ఖురాలు కాదు అది."

"అలా అతనిపట్ల ప్రవర్తించే హక్కు దానికి లేదు."

"అతను ఆమె ప్రేమలో పడ్డట్టుగానే, అదీ అతని ప్రేమలో పడ్డదని నా నమ్మకం."

"డాక్టర్ లెన్నాక్స్ ఈ సంగతి దాని తల్లికి తెలియజెప్పాలి."

మెక్లాడ్‌కు వచ్చినంత కోపం మరెవరికీ రాలేదు. "అర్థంపర్థం లేదు. వాడు క్షయతో తీసుకుంటున్నాడు. ఆ పిల్లా అదే పరిస్థితిలో వుంది!"


కాంబెల్ అన్నాడు వ్యంగ్యంగా. "ఉన్న సమయంలో సరదాగా బతకనీండి వాళ్లను. ఏదో భాగోతం నడుస్తోందని నాకు తెలుసు. కానీ, నేను వాళ్లను తప్పు పట్టను."

"వాళ్లను గురించి నువ్వలాగే మాట్లాడతావు" అన్నాడు మెక్లాడ్.

"మాట్లాడకు. అందులో తనకేం రాని పక్షంలో, అలాంటి అమ్మాయితో అలా ప్రవర్తించే మనిషి కాదు టెంపుల్‌టన్. ఆమె కూడా అమాయకురాలేం కాదు!"

ఇద్దరినీ దగ్గరగా గమనించిన ఆషెన్‌డెన్‌కు అందరి కంటే బాగా తెలుసు. చివరకు టెంపుల్‌టన్ అతనికి తన మనసులోని మాట చెప్పాడు. తన పరిస్థితికి తనకే నవ్వు వచ్చిందతనికి. "ఇప్పుడు ఈ జీవితంలో ఓ మంచి అమ్మాయితో ప్రేమలో పడటం విచిత్రం. నేనెప్పుడూ ఊహించనిది. గొంతు లోతున కూరుకుపోయి ఉన్నాను. రేపామెను నన్ను పెళ్లిచేసుకోమని అడుగుతాను. మంచి అమ్మాయిలు ఒట్టి బోర్ అని నేనెప్పుడూ అనుకుంటుండేవాడిని. ఆమె బోర్ కాదు, ఆ పైన మహాతెలివి గలది. అందమైంది కూడా. ఆమ్మో! ఎలాంటి చర్మం! ఆ జుట్టు! కానీ, ఇవి కాదు... నన్ను ప్రేమలో పడేసింది. మీకు తెలుసా అదేమిటో? తెలిస్తే నవ్వుతారు. నేనొట్టి లఫూట్ వెధవని. ఆమెలోని పవిత్రత, శీలం! అవీ ననాకర్షించింది. నాకు నవ్వు వస్తోంది. స్త్రీలలో అవి దుర్లభమని నేనెప్పుడూ అనుకుంటాను: వాటి కోసం చూడలేదు. కానీ, అవి ఆమెలో ఉన్నాయి. వాటి నుంచి నేను తప్పించుకోలేను. ఆమె పవిత్రత ముందు నేను పురుగులా ఉన్నాను. మీకు ఆశ్చర్యంగా ఉందా, ఇదంతా?"

"ఏ మాత్రం లేదు" అన్నాడు ఆషెన్‌డెన్. "అమాయకత్వానికి చిక్కిన మొదటి తప్పుడు మనిషివి నువ్వే కాదు. మధ్యవయస్కుల్లో ఉండే భావుకత్వం మాత్రమే అది."



"నువ్వొట్టి దుర్మార్గుడివి" నవ్వాడు టెంపుల్‌టన్.

"అందుకామె ఏం చెప్పింది?"

"అమ్మో, నేనామెకు చెప్పాననుకున్నావా? ఇంత మటుకు మిగతా వాళ్లకు చెప్పనిదేమీ ఆమెకు చెప్పలేదు. నేను ఆరు నెల్లలో చనిపోవచ్చు. ఆ పైన నాలాంటివాడు అలాంటి పిల్లకు ఇవ్వగలిగిందేముంది?"

ఇప్పుడు ఆషెన్‌డెన్‌కు పూర్తిగా నమ్మకం కుదిరిపోయింది. అతనిలాగానే ఆమె కూడా అతని ప్రేమలో పడిపోయిందని. డైనింగ్ రూంలోకి అతను వచ్చినప్పుడు ఆమె బుగ్గలు ఎర్రబడటం ఆషెన్‌డెన్ గమనించాడు. అతను ఆమెను గమనించనప్పుడు ఆమె అతని వంక మృదువుగా, ప్రేమగా చూడటం కూడా చూశాడు. తన పాత అనుభవాల్ని గురించి అతను చెప్తున్నప్పుడు ఆమె చిరునవ్వులో ఏదో ప్రత్యేకమధురిమ ఉంది. పైన టెర్రస్ మీద చలికి పేషెంట్లు ఎండలో కూర్చున్నట్లు, ఆమె అతని ప్రేమలో స్నాత అయింది. అంతటితో ఆ విషయాన్ని వదిలేసిందామె. అతనికి తెలియకూడదని ఆమె బహుశః అనుకుంటూంటే అతనికి తెలియజెప్పటమూ తన పని కాదని ఆషెన్‌డెన్ అనుకున్నాడు.

అప్పుడు ఆ నిశ్శబ్దసమయాన్ని భంగపరిచే సంఘటనొకటి జరిగింది. మెక్లాడ్, కాంబెల్ కలిసి బ్రిడ్జి ఆడేవారు. టెంపుల్‌టన్ వచ్చిందాకా శానటోరియంలో అలాంటి మంచి ఆటగాళ్లు మరెవరూ లేరు. ఒకళ్లనొకళ్లు తిట్టుకునేవాళ్లు. ఆటయ్యాక అంతు లేని విమర్శలు చేసుకునేవాళ్లు. అన్నేళ్ల ఆడాక ఒకళ్ల ఆట మరొళ్లకి పూర్తిగా తెలిసిపోయింది. ఒకళ్లనొకళ్లు మించాలని ప్రయత్నించేవాళ్లు. టెంపుల్‌టన్ వాళ్లతో జట్టుగా ఆడటానికి ఇష్టపడలేదు. మంచి ఆటగాడైనా ఐవీతో జట్టు కట్టి ఆడటమే అతని కిష్టం. ఆమె ఆట చెడగొడుతుందని మెక్లాడ్, కాంబెల్ ఇద్దరూ అంగీకరించారు. అందుకే ఆమెతో జట్టు కట్టటం వాళ్ల కిష్టం లేదు. పొరపాటు చేసి ఆట ఓడిపోయాక ఆమె నవ్వి, "ఏం లేదు. చిన్నపొరపాటు, అదే తేడా" అనేది.

ఆ రోజు ఆమెకు తలనొప్పి వచ్చింది. ఆటకు రాలేదు. ఆమెకు బదులు ఆషెన్‌డెన్‌ను వేసుకున్నారు. మెక్లాడ్ భాగస్వామి టెంపుల్‌టన్, కాంబెల్ భాగస్వామి ఆషెన్‌డెన్. ఆట జోరుగా సాగింది. మెక్లాడ్, కాంబెల్ అవతలివాళ్లు గెలవకూడదన్న పట్టుదలతో ఆడారు. మధ్యలో ఇద్దరి మధ్యా వాగ్వివాదాలయాయి. సాయంత్రం ఐదున్నర అయింది. చివరి రబ్బరు మొదలైంది. ఆరింటికల్లా విశ్రాంతి గంట మోగుతుంది. గంట మోగగానే విశ్రాంతి తీసుకోవాలి. ఆట మహాపట్టుగా సాగింది. జనం టేబుల్ చుట్టూ మూగారు. అందరికీ ఉత్కంఠ పెరిగింది. ఆవేశంలో మెక్లాడ్ ముఖం పాలిపోయింది, నుదుట చెమట పట్టింది. చేతులు వణికాయి. కాంబెల్ ముఖం గంభీరమై పోయింది. ఆటైపోయింది. మెక్లాడ్ గెల్చాడు. జనం చప్పట్లు చరిచి ప్రశంసించారు. విజయగర్వంతో మెక్లాడ్ ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. పిడికిలి బిగించి ఊపాడు కాంబెల్ నుద్దేశించి.

"ఇంక వాయించు నీ దరిద్రపుగొట్టు ఫిడేలు మీద!" అనరిచాడు. "గ్రాండ్ శ్లాం, డబులూ, రీ డబులూ. నా జీవితమంతా అది గెలవాలనే అనుకున్నాను. చివరికి విజయం సాధించాను. దేవుడా, దేవుడా!"

అతను ఊపిరందక ఆయాసపడ్డాడు. తూలి, టేబుల్ మీద పడిపోయాడు. నోటి నుంచి రక్తం బయటికి ప్రవహించింది. డాక్టరు కోసం కబురంపారు. అటెండెంట్లు వచ్చారు. అతను చనిపోయాడు.

రెండు రోజుల తర్వాత అతన్ని ఖననం చేశారు. రోగుల మనసు చెదిరిపోకుండా ఆ రోజు పొద్దున్నే శవపేటికను తీసుకెళ్లారు. అంత్యక్రియలకు అతని బంధువు నల్ల ఉడుపుల్లో గ్లాస్‌గో నుంచి వచ్చాడు. అతనంటే ఎవరికీ ఇష్టంలేదు. ఎవరూ విచారించనూ లేదు. వారాంతానికి అంతా అతన్ని మరిచిపోయారు.

ఆ ముఖ్యమైన టేబుల్‌ను ఇండియన్ సివిలియన్ ఆక్రమించుకున్నాడు. తనింతకాలం వాంఛించిన గదిలోకి కాంబెల్ మారాడు.

"ఇంక మనకు శాంతి" అన్నాడు డాక్టర్ లెన్నాక్స్ ఆషెన్‌డెన్‌తో. "అబ్బ! ఏళ్ల తరబడి ఇద్దరు మనుషుల తగాదాలు, ఫిర్యాదులతో నా తల బొప్పి కట్టిపోయింది... శానటోరియం నడపాలంటే ఎంతో ఓర్పు కావాలి. చూడు, ఏమైందో, ఇంత కాలం నా ప్రాణం తీసి, చివరికి జనానికి భయం కలిగేట్టు చచ్చాడు."


"అది షాకు వల్ల కలిగిన మృతి" అన్నాడు ఆషెన్‌డెన్.

"అతనెందుకూ పనికిరాని మనిషి. అయినా కొంతమంది స్త్రీలు అది చూసి అప్సెట్ అయిపోయారు. పాపం, ఐవీ బిషప్ అయితే వాలలు కట్టి ఏడ్చింది."

"తన కోసం కాకుండా అతని కోసం ఏడ్చింది ఆమె ఒక్కత్తే."

అయితే, అతన్ని మరిచిపోని వ్యక్తి మరొకతనున్నాడు. కాంబెల్‌కు పిచ్చెత్తిపోయింది. బ్రిడ్జి ఆడటం మానేశాడు, ఎవరితో మాట్లాడటం లేదు. నిస్సందేహంగా అతను మెక్లాడ్ కోసమే ఏడుస్తున్నాడు. గదిలో నుంచి కదలటం లేదు, భోజనం కూడా గదిలోకే తెప్పించుకుంటున్నాడు. డాక్టరు లెన్నాక్స్ దగ్గరికి వెళ్లి తనకా గది బాగాలేదనీ, తన్ను మళ్లీ మార్చెయ్యాలనీ అడిగాడు.

లెన్నాక్స్‌కు ఎప్పుడో కాని కోపం రాదు. ఈ సారి మండిపోయాడు. ఎన్నో ఏళ్ల నుంచి ఆ గది ఇవ్వమని తన్ను సతాయించిన పెద్దమనిషి, ఉంటే అక్కడే ఉండాలి, లేకపోతే శానటోరియం వదలి వెళ్లాలని చెప్పాడు డాక్టరు. అతను గదికి తిరిగొచ్చి ఖిన్నవదనంతో కూర్చుండిపోయాడు.



"ఫిడేలు వాయించొచ్చుగా! పక్షం రోజుల నుంచి మీరు వాయించగా నేను చూడలేదు" అంది మాట్రన్.

"వాయించలేదు. ఇంక వాయించను. నాకిప్పుడు సరదా లేదు. నేను వాయిస్తే మెక్లాడ్‌కు పిచ్చెక్కుతుందని తెలుసు. అది నాకు బాగుండేది. అందుకే వాయించేవాడిని. నేనిప్పుడు వాయించినా, వాయించకపోయినా ఎవరికీ అక్కర్లేదు. ఇంక వాయించను!"

శానటోరియంలో ఆషెన్‌డెన్ ఉన్నంతకాలం అతనెప్పుడూ ఫిడేలు వాయించలేదు. విచిత్రం, మెక్లాడ్ మరణంతో అతనికి జీవితం పట్ల రుచి పోయింది. పోట్లాడే వాళ్లెవరూ లేక, తనకు కోపం తెప్పించే వాళ్లెవరూ లేక అతని ఉల్లాసం నశించింది. తన శత్రువు సమాధిని అనుసరించటానికి అతనికెంతో కాలం పట్టదని అందరికీ స్పష్టమైంది.

అయితే, టెంపుల్‌టన్ మీద మెక్లాడ్ మృత్యువు మరో ప్రభావం చూపింది. అది ఆశించని పరిణామాన్ని కలిగించింది. ఆ విషయం గురించి అతను తనకు సంబంధం లేనట్టుగా ప్రశాంతంగా ఆషెన్‌డెన్‌తో మాట్లాడాడు.

"విజయం వరించిన ఆ క్షణంలో అలా పోవటం గొప్పే. ఆ స్థితికి అందరూ ఎందుకు చేరుకుంటారో నాకు అర్థం కాలేదు. అతను ఎన్నో ఏళ్ల బట్టి ఉన్నాడు కదా, ఇక్కడ?"

"పద్దెనిమిదేళ్లనుకుంటాను."

"ఎందుకా నిరర్థకజీవితం? చెయ్యాల్సింది చేసి, పరిణామాన్ని ఎదుర్కొనటం మంచిదనుకుంటాను నేను."

"మీ జీవితం పట్ల మీకెంత విలువుందో అన్న దాని మీద అది ఆధారపడివుంది."

"కానీ, ఇది జీవితమా?"

ఆషెన్‌డెన్ దగ్గర జవాబు లేదు. కొన్ని నెల్లల్లో తనకు బాగవుతుందన్న ఆశ్వాసన వుంది. కానీ, టెంపుల్‌టన్‌ను చూస్తే అర్థమవుతోంది అతనికి నయమవదని. మృత్యువు అతని ముఖం మీద ఆడుతోంది.

"నేనేం చేశానో తెలుసా?" అడిగాడు టెంపుల్‌టన్. "నన్ను పెళ్లి చేసుకోమ్మని ఐవీని అడిగాను."

ఉలిక్కిపడ్డాడు ఆషెన్‌డెన్.

"ఏమంది ఆమె?"

"అంత వికారపుమాట తన జీవితంలో వినలేదన్నది. నాకు పిచ్చి పట్టి అలాంటి ఆలోచన వచ్చిందన్నది."

"ఆమె సరైన మాటే అన్నదని మీరు ఒప్పుకోవాలి."

"ఒప్పుకోకేం? కానీ, ఆమె నన్ను పెళ్లి చేసుకోబోతున్నది."

"పిచ్చితనం, ఉన్మాదం అది."

"అవును, నిజమే. ఏమైనా మేం లెన్నాక్స్‌ను కలుసుకుని అతనేమంటాడో తెలుసుకుంటాం."

శీతకాలం గతించింది చివరికి. కొండల మీద ఇంకా మంచు పేరుకునే ఉంది. కానీ, లోయల్లో కరిగిపోయింది. కింది వాలుల్లో బిర్చి చెట్లు ఆకులు తొడుగుతున్నాయి. వసంతాగమనహేల గాలిలో తేలియాడుతోంది. సూర్యుడు వేడెక్కాడు. అందరికీ చురుకుదనం అనిపించింది. కొంత మందికి హాయి అనిపించింది. శీతకాలకాపురస్థులు దక్షిణం వైపు వెళ్లాలని పథకాలు వేసుకుంటున్నారు.

టెంపుల్‌టన్, ఐవీ కలిసి డాక్టర్ లెన్నాక్స్‌తో మాట్లాడారు. తమ ఆలోచన అతనికి చెప్పారు. అతను వాళ్లను పరీక్ష చేశాడు. ఎక్స్‌రేలు తీశారు, రకరకాల పరీక్షలు చేశారు. డాక్టరు పరీక్షల ఫలితాలు వాళ్ల ముందుంచారు. స్పష్టంగా వాళ్లున్న పరిస్థితి గురించి వివరించాడు.

"అంతా బాగానే ఉంది. మేం పెళ్లి చేసుకోవచ్చో లేదో చెప్పండి!" అనడిగాడు టెంపుల్‌టన్.

"మహా అవివేకమైన పని అది."

"అది మాకు తెలుసు. మరింకేమైనా వుందా?"

"మీకు బిడ్డ కలిగితే అది మహానేరం."

"మాకు అలాంటి ఆలోచన లేదు" అంది ఐవీ.

"సరే, పరిస్థితి మీకు వివరిస్తాను. ఆ తర్వాత మీరు నిర్ణయించుకోండి. మామూలు జీవితం గడపగలిగే బలం ఐవీకి లేదు. తను ఎనిమిదేళ్లుగా బతుకుతున్న రీతిగా బతికితే..."

"శానటోరియంలోనా?"

"అవును, ఆమె పండు ముసలితనం దాకా కాకపోయినా, చాలాకాలమే సుఖంగా బతకొచ్చు. రుగ్మత నిదానంగా ఉంది. ఆమె మామూలు జీవితం గడప ప్రయత్నిస్తే రోగజీవులు మళ్లీ ఉద్భృతమవొచ్చు. ఫలితమెలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. టెంపుల్‌టన్, ఇంక మీ విషయంలో స్పష్టంగా చెప్పొచ్చు. మీ లంగ్స్ ట్యూబర్‌కిల్‌తో నిండిపోయాయి. మీరు పెళ్లి చేసుకుంటే ఆర్నెల్ల కంటే ఎక్కువ బతకరు."

"చేసుకోకపోతే ఎంత కాలం బతుకుతాను?"

డాక్టరు చెప్ప సంకోచించాడు.

"భయపడకండి. నిజమేమిటో నాకు చెప్పొచ్చు."

"రెండు లేక మూడేళ్లు."


"థాంక్యూ. అదే మేం తెలుసుకోవాలనుకున్నది."

తామక్కడికి వచ్చినట్టుగానే చేతిలో చేయి వేసుకుని వాళ్లు వెళ్లిపోయారు. ఐవీ మెల్లగా ఏడవసాగింది. ఒకళ్లకు ఒకళ్లేం చెప్పుకున్నారో ఎవరికీ తెలీదు. కానీ, లంచ్‌కి వచ్చేటప్పటికి వాళ్ల ముఖాలు వెలిగిపోతున్నాయి. తమకు లైసెన్స్ దొరగ్గానే తాము పెళ్లి చేసుకోబోతున్నామని వాళ్లు ఆషెన్‌డెన్‌కూ, హెన్రీకీ చెప్పారు. ఐవీ, హెన్రీ వంక చూసింది:

"నా పెళ్లికి మీ భార్య వస్తే బావుంటుంది. ఆమె రాగలదా?"

"మీరిక్కడే పెళ్లి చేసుకోబోతున్నారా?"

"అవును, మా బంధువులూ, అతని



బంధువులూ దీన్ని ఆమోదించరు. అందుకే అయ్యాక గానీ మేం వాళ్లకు చెప్పదలుచుకోలేదు. డాక్టర్ లెన్నాక్స్‌ను కన్యాదాతగా వ్యవహరించమని అడుగుతాం."

హెన్రీ ఆమెకు జవాబివ్వలేదు. అతను మాట్లాడతాడని ఎదురుచూసిందామె. మిగతా మగవాళ్లిద్దరూ అతని వంక చూశారు. అతను మాట్లాడినప్పుడు అతని గొంతు వణికింది. "మీరు ఆమెను ఆహ్వానించటం మీ మంచితనం. రమ్మని రాస్తాను."

పేషెంట్లకీ వార్త చేరినప్పుడు అందరూ వాళ్లను అభినందించారు కానీ, ఆ తర్వాత చాలా తప్పు పని అని చెవులు కొరుక్కున్నారు. శానటోరియంలో జరిగేదేదీ గోప్యంగా ఉండదు. పెళ్లి చేసుకుంటే ఆర్నెల్లలో చస్తావని టెంపుల్‌టన్‌కు డాక్టరు చెప్పిన విషయం తెలిసి వాళ్లు అవాక్కైపోయారు. మహామందమతుల హృదయం కూడా కదిలిపోయింది. వాళ్లలా ప్రేమతో ఒకళ్ల కోసం ఒకళ్లు జీవితాన్ని త్యజించసిద్ధపడటంతో ఓ సుహృద్వాతావరణం, ప్రేమ వ్యాపించిపోయాయి శానటోరియంలో. మాటల్లేని మనుషులు మాట్లాడుకోసాగారు. కొద్ది కాలం తమ బాధలను మరిచిపోయారు. ఆ జంట ఆనందాన్ని తామూ పంచుకుంటున్నట్టు కనిపించారు. వసంతాగమనం వాళ్ల శిథిలహృదయాలను కొత్త ఆశలతో నింపింది. ఆ స్త్రీపురుషులకు బంధించిన ప్రేమ దగ్గరి కొచ్చిన వారందరి మైనా తన కాంతిరేఖలను ప్రసరింపజేసింది. ఐవీ మహాప్రసన్నంగా ఉంది. ఉల్లాసం ఆమెకు తగినట్లుంది. వయసు తగ్గినట్టుగా, మరీ అందంగా కనిపించిందామె. టెంపుల్‌టన్ గాలిలో తేలిపోతున్నాడు. తనకీ ప్రపంచంలో పట్టించుకోవలసిందేమీ లేనట్లు అతను హాస్యం చేస్తున్నాడు, నవ్వుతున్నాడు. దీర్ఘకాలనిరంతరానందం అతను వాంఛిస్తున్నాడని మీరనుకోవచ్చు. అయితే, అతను ఓ రోజు ఆషెన్‌డెన్‌కు తన మనసులోని మాట చెప్పాడు.

"ఇదేం చెడ్డ చోటు కాదు" అన్నాడతను. "నా పనైపోగానే ఐవీ ఇక్కడికి వస్తానని నాకు వాగ్దానం చేసింది. ఇక్కడి వాళ్లంతా ఆమెకు తెలుసు. ఆమె ఒంటరిగా ఉండక్కర్లేదు."

"డాక్టర్లూ పొరపాట్లు చేస్తూ ఉంటారు. మీరో పద్ధతిలో జీవితం గడిపితే, మరెంతో కాలం మీరు బతికే అవకాశం ఉంది" అన్నాడు ఆషెన్‌డెన్.

"నేనడిగేది మూడు నెలలే. ఆ మాత్రం లభిస్తే చాలు. ఇందుకు సార్థక్యం కలుగుతుంది."

హెన్రీ భార్య పెళ్లి రెండు రోజులుందనగా వచ్చింది. కొన్ని నెలలుగా భార్యాభర్తలు ఒకరినొకరు చూసుకోలేదు. అందుకే ఒకళ్లనొకళ్లు చూసుకుని సిగ్గుపడ్డారు. తామే ఉన్నప్పుడు వాళ్ల కిబ్బందిగా, మాటలు లేనట్టయిపోతారని ఊహించటం తేలికే. తన కలవాటైపోయిన వ్యాకులతనూ, కుంగిపోయినతనాన్నీ వదిలించుకో ప్రయత్నించాడు హెన్రీ. ముఖ్యంగా భోజనాల దగ్గర మహాఆనందంగా, కులాసాగా కబుర్లు చెప్పాడు, ప్రవర్తించాడు. జబ్బు పడకముందున్న అతని సహజవ్యక్తిత్వం బయల్పడినట్లయింది. పెళ్లి రేపనగా సాయంత్రం అందరూ కలిసి భోజనం చేశారు. టెంపుల్‌టన్, ఆషెన్‌డెన్ పక్కపక్కనే కూర్చున్నారు. షాంపేను తాగారు. హాస్యాలాడుకుంటూ, నవ్వుకుంటూ రాత్రి పది గంటల దాకా గడిపారు. మర్నాడు పొద్దున కిర్క్‌లో వాళ్ల పెళ్లి జరిగింది. ఆషెన్‌డెన్ తోడపెళ్లికొడుకుగా వ్యవహరించాడు. శానటోరియంలో లేచినిలబడగలిగిన వాళ్లంతా పెళ్లికి హాజరయ్యారు. కొత్త జంట లంచవ్వగానే కార్లో ప్రయాణమవుతారు. డాక్టర్లూ, నర్సులూ వాళ్లకు వీడ్కోలివ్వడానికి జమయ్యారు. ఎవరో కారు వెనక పాతచెప్పు కట్టారు. టెంపుల్‌టన్, అతని భార్యా శానటోరియం ద్వారం దాటి బయటి కడుగిడగానే వాళ్ల మీద అక్షింతలు కురిశాయి. వాళ్ల కారు కదలగానే హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. వాళ్లు కారు అలా ప్రేమ దిశగానూ, మృత్యువు దిశగానూ కదిలింది. మెల్లగా గుంపు కదిలిపోయింది.

హెన్రీ, అతని భార్యా నిశ్శబ్దంగా పక్కపక్కనే నడిచారు. కొంత దూరం వెళ్లాక అతను సిగ్గుపడుతూ భార్య చేతినందుకున్నాడు. ఆమెకు గుండె కొట్టుకోవడం ఆగినట్లనిపించింది. పక్క నుంచి చూసిన ఆమెకు అతని కళ్లు నీళ్లతో నిండినట్టు కనిపించాయి.

"నన్ను క్షమించు, డియర్. నేను నీ పట్ల నిర్దయగా ప్రవర్తించాను" అన్నాడతను.

"నాకు తెలుసు-నీ ఉద్దేశం అది కాదు" అందామె తొట్రుపడుతూ.

"అవును. అది నిజం. నేను బాధపడుతున్నాను కనుక నువ్వు బాధపడాలని అనుకున్నాను. ఇంకిప్పుడు అది జరగదు. ఈ టెంపుల్‌టన్, ఐవీల సంగతి... ఎలా చెప్పాలో నాకర్థం కావటం లేదు. అది నన్ను అన్నిటినీ భిన్నంగా చూసేట్టు చేసింది. చావంటే నాకింక లెక్క లేదు. మృత్యువు ప్రేమంత ముఖ్యమైందనుకోను. నువ్వు బతకాలి. హాయిగా, ఆనందంగా ఉండాలనే నేను కోరుకుంటున్నాను. నిన్ను గురించి నేనిహ అసూయపడను, దేన్నీ నిరాకరించను. చచ్చేది నేనే, నువ్వు కాదనుకుంటే నాకిప్పుడెంతో ఆనందంగా ఉంది. ప్రపంచంలోని మంచంతా నీకు జరగాలని నేను కోరుకుంటున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

■

